సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 25 । జనవరి । 2025



వేటేయాలంటే.. ఓటుండాలి

దేశ ప్రజాసామ్య సౌధానికి హక్కుగా నిలుస్తున్న, ప్రశ్నించే అధికారం కలిగిన ఓటును రాజ్యాంగం ప్రసాదించింది. 10లో



ఘనంగా బాలికల దినోత్సవం

జిల్లాలోని పలు మండలాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సదస్సులు జరిపారు. 11లో



వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం మబ్బులు పట్టే అవకాశం ఉంది. మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రత కొంతమేర పెరగవచ్చు.

న్యూస్‌రీల్

మిర్చి పంటను పరిశీలించిన తుమ్మల

దమ్మపేట : సొంత వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పలు రకాల పచ్చి మిర్చి పంటలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పరిశీలించారు. శుక్రవారం మండలం లోని గండుగులపల్లి గ్రామ శివారులోనున్న తన వ్యవసాయ క్షేత్రాలను మంత్రి తుమ్మల అనుచరులతో కలిసి సందర్శించారు. మిర్చి పంట కాపునకు రాగా కోసిన మిర్చి గుత్తులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి వెంట అలపాటి రామచంద్ర ప్రసాద్, కాసాని నాగప్రసాద్, కేవీ తదితరులు ఉన్నారు.

డిజిటల్ లావాదేవీలపై శిక్షణ

చుంచుపల్లి: యూపీఐ డిజిటల్ లావాదేవీల వినియోగంపై సీఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులకు కలెక్టరేట్‌లో శుక్రవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విద్యాచందన హాజరై మహిళా సంఘాలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రైనర్ యుగంధర్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలతోపాటు సామాజిక భద్రతా పథకాలు, ఇతర ఆర్థిక ఉత్పత్తుల వినియోగం, అంతర్గత అప్పులు, తిరిగి చెల్లింపులు, రికార్డుల నిర్వహణ, సమావేశాలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ డీఆర్‌డీఓ నీలయ్య, ఏపీఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాలను విస్తరించాలి

అశ్వారావుపేట: పోస్టల్ ఖాతాలను ప్రతి ఇంటికి విస్తరించాలని తపాలా శాఖ సూపరింటెండెంట్(ఎస్పీ) వీరభద్రస్వామి సూచించారు. శుక్రవారం పోస్టాఫీస్‌లో అశ్వారావుపేట, దమ్మపేట గ్రామీణ తపాలా ఉద్యోగులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తపాలా సిబ్బంది పోస్టల్ పొదుపు ఖాతాలను అధిక సంఖ్యలో ప్రారంభింపజేయాలని సూచించారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలు, ప్రయోజనాలు, పొదుపు ఖాతాల ప్రయోజనాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి ఖాతాలను పెంచాలని సూచించారు. ఎస్పీఎం సాయి ప్రభ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పాల్వంచ ఐపీవో వీరన్న, మెయిల్ ఓవర్సీస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రామాలయంలో టెండర్లు ఖరారు

- వస్త్రాల విక్రయానికి రూ.50 లక్షలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో భక్తులు స్వామివారికి సమర్పించిన వస్త్రాల విక్రయ టెండర్‌కు హెచ్చు ధర లభించింది. శుక్రవారం టెండర్లకు పాట నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి జనవరి 31, 2026 వరకు వస్త్రాల విక్రయానికి రూ.50,25,000కు భద్రాచలానికి చెందిన ఎస్వీ హెచ్ సుబ్బారావు పాట దక్కించుకున్నారు. గతంలో ఇదే టెండర్ రూ.39,05,000 పలికింది. విస్తా కాంప్లెక్స్‌లో కూల్ డ్రింక్స్ షాపు, మరో ఐదు దుకాణాలకు కూడా టెండర్లను ఖరారు చేశారు.



కిన్నెరసాని రిజర్వాయర్

రా రమ్మని.. రారా రమ్మని..

ప్రకృతితో పెనవేసుకున్న ప్రదేశాలు.. ఎత్తయిన కొండలు, గుట్టలు.. పచ్చని చెట్లు, పారేటి సెలయేర్లు.. ఆధ్యాత్మికం పరిఢవిల్లే ఆలయాలు, చారిత్రక కట్టడాలు.. ఉమ్మడి జిల్లాకు పర్యాటక శోభ తెచ్చిపెడుతున్నాయి. పర్యాటకులకు కనువిందు చేస్తూ, ప్రకృతి రమణీయతను చాటుతున్నాయి. ఇక తీగల వంతెన, హోటళ్లు, వసతి గృహాలు నిర్మిస్తే పర్యాటకాభివృద్ధితోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుంది. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – పాల్వంచరూరల్

ప్రకృతి అందాలతో మనసు దోచే కిన్నెరసాని

- అపురూప ఆలయాలు, చారిత్రక కట్టడాలు
- ఆకర్షిస్తున్న ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ఎత్తయిన కొండలు, గుట్టలు, జలాశయం మధ్య చూడచక్కని హైలాండ్స్, పచ్చని పచ్చిక బయళ్లు, వృక్షాలు కిన్నెరసాని సొంతం. పెద్దమ్మతల్లి గుడి, నవభారత్ వేంకటేశ్వరస్వామి ఆలయం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయం, పర్ణశాల వంటి ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి 24 కిలోమీటర్ల దూరంలో కిన్నెరసాని ఉంది. ఇక్కడ కిన్నెరసాని జలాశయం, అందులో రెండు ద్వీపాలు, బోటు షికారు, చుక్కల దుప్పులు కలిగిన డీర్‌పార్కు, అద్దాల మేడ, కాటేజీలు ఉన్నాయి. ప్రకృతి సోయగాలను ఆస్వాదించేందుకు కిన్నెరసానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వచ్చిపోతుంటారు. వీరి కోసం ప్రత్యేక కుటీరాలను నిర్మించారు. ప్రభుత్వం 2015లో నీతి అయోగ్ పథకం కింద కేంద్రం ద్వారా రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేసింది. ఆయా నిధులతో కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద చేపట్టిన హరిత హోటల్ వచ్చే ఫిబ్రవరి 20 నాటికి పూర్తి కానుంది. కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు పనులు నిర్మాణ పూర్తి కాగా, నిర్వహణ బాధ్యతలను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు టూరిజం శాఖ అప్పగించనుంది. వచ్చే నెలలో ఇవి పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి.

ఇంకా కొన్ని చేస్తే..

ఉమ్మడి వరంగల్ జిల్లా లక్నవరంలో ఏర్పాటు చేసినట్లు కిన్నెరసానిలో కూడా జలాశయంలోని నీళ్ల మధ్య ఉన్న రెండు హైలాండ్స్ నడుమ వంతెనను ఏర్పాటు చేసి, ప్రత్యేక హోటళ్లను, వసతి గృహాలను నిర్మించాలి. అప్పుడే కిన్నెరసానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. కనీసం బస్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఆటోల్లో వారు అడిగినంత ఇచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాలపై దృష్టి సారించి అధికారులు మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది.

వేంకటేశ్వరస్వామి ఆలయం

జిల్లా కేంద్రానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలోని కలెక్టర్ కార్యాలయం పక్కన గుట్టపై నవభారత్ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి భక్తులు ప్రతి శనివారం అధిక సంఖ్యలో వస్తుంటారు.

పెద్దమ్మతల్లి ఆలయం


భద్రాచలం వైపు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కన పాల్వంచకు నాలుగు కిలోమీటర్ల దూరంలో జగన్నాథపురం వద్ద పెద్దమ్మతల్లి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఆది, గురు, శుక్రవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. అన్నపురెడ్డిపల్లిలో కాకతీయుల కాలంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇది భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. స్తంభాలు, గోడలపై చెక్కిన శిల్పాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

జిల్లా కేంద్రానికి 45 కిలోమీటర్ల దూరంలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఉంది. దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో ఒక్కటిగా ఉంది. గోదావరి తీరం వెంట రామాయణం కాలం నాటి ఘట్టాల ఆనవాళ్లు, బాపు బొమ్మలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. భద్రాచలానికి 36 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ఒడ్డున ఉన్న పర్ణశాల ఆలయం ఉంది. రామాయణం కాలం నాటి ఘట్టాల ఆనవాళ్లు, రాముడు సతీసమేతంగా వనవాసం చేస్తూ ఈ అడవుల్లోనే ఉన్నట్లు ఆలయ చరిత్ర చెబుతోంది.

ఖమ్మం జిల్లాలో..

ఖమ్మం జిల్లాలోని జమలాపురంలో చిన్న తిరుపతిగా పేరుగాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. భక్తుల రద్దీతో కళకళాడుతోంది. కూసుమంచిలో కాకతీయులు నిర్మించిన శివాలయం, విశ్రాంతి భవనం ఉన్నాయి. నేలకొండపల్లిలో వంద ఎకరాల విస్తీర్ణంలో మట్టితో నిర్మించిన చారిత్రక బౌద్ధ స్తూపం, మజ్జుగూడెంలో బౌద్ధులు నాడు నిర్మించిన స్తూపాలు, గృహాలున్నాయి. ఖమ్మం పట్టణంలో చారిత్రక కట్టడం స్తంభాద్రి ఖిల్లా, లకారం చెరువు ఉన్నాయి. లకారం చెరువుపై రూ.8 కోట్లతో నిర్మించిన సెన్సార్ బ్రిడ్జీ ఆకట్టుకుంటోంది. వైరా జలాశయానికి సైతం పర్యాటకులు వస్తున్నారు.



ఖమ్మం ఖిల్లా

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

కిన్నెరసానిలోని జింకల పార్కు

3 నుంచి బస్సు యాత్ర

ముగిసిన ఆర్టిజన్ కార్మికుల రిలే దీక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏసీ జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల సర్కిల్ కార్యాలయాల ఎదుట ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఐదో రోజు దీక్షల్లో జిల్లా ఆర్టిజన్ కార్మికులు కూర్చున్నారు. జేఏసీ జిల్లా చైర్మన్ కోనరాజు శ్రీనివాస్, కోచైర్మన్ మోతీరాం శరత్, కోకన్వీనర్ గ్లోరీ, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, పూర్ణిమ, రవి, చంద్రశేఖర్, సోషల్‌మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు కోలగాని రమేష్, డివిజన్ సెక్రటరీ పులి గణేష్‌బాబు, జిల్లా మహిళా నాయకురాలు లీలావతి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి వీరన్నలు దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ రిలే దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఇంటికి వెళ్లే దయనీయ పరిస్థితి ఉందని ఆవేదనవ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జెన్ కో యాజమాన్యం స్పందించి ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 3 నుంచి 13వ తేదీ వరకు బస్సుయాత్ర చేపడతామని, 20వ తేదీ చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.



రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టిజన్ కార్మికులు

ఏడాది పాలనకే ప్రభుత్వంపై వ్యతిరేకత

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

అశ్వాపురం: ఏడాది పాలనకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనబడుతోందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. అశ్వాపురంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటుతో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు గ్రామాలకు పోలేక వందల మంది పోలీసులతో సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసి అవి అమలు చేయలేక, మళ్లీ స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు గ్రామసభల్లో కొత్త పథకాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తే గ్రామానికి పదో, ఇరవైయో వస్తాయని, అవి ఆ పార్టీ అనుచరులకే ఇస్తారని ఆరోపించారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో పామాయిల్ ఫ్యాక్టరీకి, నవోదయ పాఠశాలకు స్థలం కేటాయిస్తే వాటిని ఇతర ప్రాంతాలకు తరలించారన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ తోకల లత, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్ రావు, నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, ఈదర సత్యనారాయణ, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, తాటి పూజిత, మేడవరపు సుధీర్, నక్కనబోయిన పాపారావు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగా కాంతారావు

మూడో రోజూ ప్రశాంతం



కళాశాల గేటు వద్ద విద్యార్థులు

సుజాతనగర్: ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్ష మూడో రోజు శుక్రవారం కూడా ప్రశాంతంగా జరిగింది. ఉదయం షిఫ్ట్‌లో 120 మందికి గాను 115 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 120 మందికి గాను 120 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

బస్సుల సంఖ్య పెంచాలి

చుంచుపల్లి: ప్రజల అవసరాలకు తగినట్లు బస్సుల సంఖ్య పెంచాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తెల్లవారుజాము నుంచి కొత్తగూడెం డిపోలోని కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హైర్ పద్ధతిలో ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులను ఇచ్చే విధానాన్ని ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఇచ్చే సబ్సిడీ ఇన్సెంటివ్‌లను ఆర్టీసీలకు కూడా ఇవ్వాలని, బస్సులు కొనుగోలు చేయడానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులు కార్పొరేట్లకు ఇవ్వటం ద్వారా ఆర్టీసీ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు బి.ఎస్.రావు, ఎస్ కే రఫీ, జీఎస్ రెడ్డి, పర్వీన్, రామకృష్ణ, సైదులు, బిఎస్ కుమార్, కరుణ, శైలజ, నూర్జహాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశించారు. శుక్రవారం చుంచుపల్లి పోలీసు స్టేషన్‌ను, డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. చుంచుపల్లి ఠాణా ఆవరణను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించి జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. సైబర్ నేరాలపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సైబర్ సీఐ జితేందర్, ఎస్సైలు రవి, జుబేదాలు పాల్గొన్నారు.



సైబర్ క్రైమ్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌లో పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

పెల్లుబికిన ఆగ్రహం



బూర్గంపాడు: సారపాక గ్రామసభలో ఆందోళనకు దిగిన అఖిలపక్ష నాయకులు

- నిరసనలు, నిలదీతల నడుమ ముగిసిన గ్రామసభలు
- ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో అనర్హుల పేర్లే ఎక్కువ వచ్చాయని ఆరోపణలు
- ప్రజలకు సమాధానం చెప్పలేక మిన్నకుండిన అధికారులు

బూర్గంపాడు/చుంచుపల్లి/టేకులపల్లి: సంక్షేమ పథకాల గ్రామసభలు గందరగోళం నడుమ ముగిశాయి. పలుచోట్ల జాబితాల్లో అర్హుల పేర్లు రాకుండా అనర్హుల పేర్లు రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల తదితర సంక్షేమ పథకాలను అందించేందుకు జిల్లాలోనిలోని 481 గ్రామపంచాయతీలు, 103 మున్సిపల్ వార్డుల్లో ఈ నెల 21 నుంచి శుక్రవారం వరకు సభలను జరిపారు. మొదటిరోజు నుంచి చివరి రోజు వరకు సభల్లో నిరసనే ఎదురైంది. పలుచోట్ల సభలు రసాభాస మారాయి. ఎక్కువ శాతం నిరుపేదలకు న్యాయం జరగలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. అర్హుల ఎంపికలో పైరవీలకే ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. జాబితాలో పేర్లు రానివారు తిరిగి దరఖాస్తులు చేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా నాలుగు పథకాల కోసం 1,00,494 దరఖాస్తులు అందాయి. కొత్తగా వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లో పున పరిశీలన చేసిన అనంతరం పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా లబ్ధిదారుల జాబితాను రాష్ట్రస్థాయిలోనే ఎంపిక చేసి జిల్లాలకు పంపించినట్లు తెలిసింది. దేనిని ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక చేశారో తెలియని పరిస్థితి నెలకొంది.



చుంచుపల్లి : ఎన్.కె.నగర్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న స్థానికులు

టేకులపల్లిలో రసాభాస

టేకులపల్లి మండలంలో శుక్రవారం టేకులపల్లి, దాసుతండా, తడికలపూడి, సులానగర్, కోయగూడెం, కొప్పురాయి, మేళ్ళమడుగు, చింతోనిచెలక, గంగారం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. టేకులపల్లి సభ రసాభాసగా మారింది. ఎంపీడీవో రవీంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ ప్రారంభంకాగానే బీఆర్‌ఎస్ నాయకులు ఆమెడ రేణుక, భూక్య లాలునాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలు ఏ ప్రాతిపదికన నియమించారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను సభ నుంచి బయటకు తీసుకెళ్లారు. అనంతరం సభలో గ్రామపంచాయతీ కార్యదర్శి దీప్తి ఇందిరమ్మ ఇళ్ల జాబితా చదువుతుండగా, అర్హుల పేర్లు రాలేదంటూ బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపోద్రిక్తులైన ప్రజలు కుర్చీలు పడేశారు. ఓ మహిళ చేయి చేసుకోవడంతో కార్యదర్శికి కంటి వద్ద స్వల్ప గాయమైంది. దీంతో పోలీసులు, పంచాయతీ సిబ్బంది ఎంపీడీఓ, కార్యదర్శిని కార్యాలయంలోకి పంపించి, తలుపులు మూసివేశారు. ఆందోళనకారులు కార్యాలయంలోకి కూడా వెళ్లేందుకు ప్రయత్నించగా సీఐ సురేష్ తదితరులు పరిస్థితిని అదుపు చేశారు. కాగా తన విధులకు ఆటంకం కలిగించారని, తన పై దాడిచేసి కులం పేరుతో దూషించారని టేకులపల్లి కార్యదర్శి ఉప్పు దీప్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రామసభల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులు	
రేషన్‌కార్డులు	34,083
రేషన్‌కార్డుల్లో మార్పులు	11,249
ఇందిరమ్మ ఇళ్లు	38,369
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	15,672
రైతు భరోసా	1,121



టేకులపల్లి : కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నిస్తున్న ప్రజలను నిలువరిస్తున్న పోలీసులు

అర్హుల జాబితాలో మా పేర్లేవి..?.

బూర్గంపాడు మండలంలోని సారపాక, నాగినేనిప్రోలు, బూర్గంపాడు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం జాబితాలో అనర్హులే ఎక్కువ మంది ఉన్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న, కుటుంబ సమగ్ర సర్వేలో రేషన్‌కార్డు లేదని తెలిపినా వారి పేర్లు అర్హుల జాబితాలో ఎందుకు చేర్చలేదని అధికారులపై స్థానికులు మండిపడ్డారు. పక్కా భవనాలు ఉన్నవారి పేర్లే ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో చేర్చారని ఆరోపించారు. సారపాక గ్రామసభలో అఖిలపక్ష నాయకులు ఆందోళనకు దిగారు. సరైన విధివిధానాలు లేకుండా ఇష్టారాజ్యంగా పేర్లు ప్రకటించారని ఆరోపించారు. ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సారపాక గ్రామసభలో భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్, ఏఓ శంకర్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరైన ప్రజలారా..!

- 20మంది లేకున్నా మాట్లాడి వెళ్లిన ఎమ్మెల్యే

అశ్వారావుపేట: అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో శుక్రవారం ప్రభుత్వ సంక్షేమ పథకాల గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ఉదయం 8–30 గంటలకే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేరుకోగా.. అప్పటికి పదిహేను మంది లోపు ప్రజలు ఉండగా అధికారులెవరూ రాలేదు. ఎమ్మెల్యే వచ్చిన విషయం తెలియగానే తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ చేరుకున్నారు. దీంతో ఉన్న కొద్దిమందిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడి వెనుదిరిగారు. ఈ విషయమై తహసీల్దార్‌ను సంప్రదించగా బస్టాండ్‌లో స్వచ్ఛ ఆర్టీసీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆపై గ్రామసభకు వచ్చారని.. దీంతో తాము చేరుకోలేకపోయామని తెలిపారు. ఇంకొన్ని సభలకు హాజరుకావాల్సి ఉండడంతో వెళ్లిపోయారని చెప్పారు. కాగా, అశ్వారావుపేటలో సమస్యలపై ప్రజలు, ప్రతిపక్షాల నేతలు నిలదీసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుండగా.. ఈ కారణంతోనే ఎమ్మెల్యే వెళ్లిపోయారని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు.



అశ్వారావుపేట గ్రామసభలో ఖాళీ కుర్చీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

క్లుప్తంగా

సమన్వయంతో ప్రమాదాలకు చెక్

భారజల కర్మాగారం జీఎం జగ్గారావు



మాట్లాడుతున్న జీఎం జగ్గారావు

అశ్వాపురం: భారజల కర్మాగారంలో ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా ప్రమాదవశాత్తు హైడ్రోజన్ సల్ఫైడ్ విడుదలైతే ప్రజలెవరూ ప్రమాదాల బారిన పడకుండా సమన్వయంతో పని చేయనున్నట్లు కర్మాగారం జీఎం జగ్గారావు వెల్లడించారు. గౌతమీనగర్ కాలనీలో శుక్రవారం రెవెన్యూ, మండలపరిషత్, ఐకేపీ అధికారులు, సిబ్బందితో జీఎం సమావేశమయ్యారు. తొలుత సేఫ్టీ మేనేజర్ యోహాన్ విషవాయువు విడుదలైతే తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం జీఎం జగ్గారావు మాట్లాడుతూ దేశానికే తలమానికంగా ఉన్న కర్మాగారం పరిధిలో 30 ఏళ్లుగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే ఒరవడి కొనసాగేలా అందరూ సహకరించాలన్నారు. ప్రమాదవశాత్తు విషవాయువు విడుదలైతే ప్రజలను అప్రమత్తం చేయడమే కాక వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో కర్మాగారం సీఏఓ వేణు, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరారం వాసికి డాక్టరేట్



నలమాస కృష్ణ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం వాసి నలమాస కృష్ణకు డాక్టరేట్ వరించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనకు డాకరేట్ పట్టా అందజేశారు. కొమరారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు పూర్తి చేసిన కృష్ణ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో రాజనీతిశాస్త్రంలో పీజీ, అక్కడే ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశాడు. 2011లో 'తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర - విద్యార్థుల రాజకీయాలు'అనే అంశంపై ఎంఫిల్ చేశారు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న ఆయన పీహెచ్‌డీ చేశారు. ఇంగ్లీష్ అండ్ ఫారిన్ ల్యాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్ విధాత పర్యవేక్షణలో ల్యాండ్ రీఫామ్స్ అండ్ రిలేషన్స్ ఇన్ తెలంగాణ అనే అంశంపై ఆయన పీహెచ్‌డీ పూర్తి చేసి, డాక్టరేట్ అందుకున్నారు.

కొత్తగూడెం క్లబ్ అధ్యక్షుడిగా కోనేరు



పూర్ణచందర్‌రావు (కుడివైపు)

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్ నూతన అధ్యక్షుడిగా కోనేరు పూర్ణచందర్‌రావు ఎన్నికయ్యారు. శుక్రవారం క్లబ్‌లో జరిగిన సమావేశంలో 32 ఏళ్లుగా క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు పదవీవిరమణ చేశారు. దీంతో మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు తనయుడైన పూర్ణచందర్‌రావును సభ్యులు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనతో పాటు రమేశ్‌బాబును సన్మానించారు. వివిధ పార్టీల నాయకులు, వ్యాపారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

భద్రాచలం ఏరియా ఆస్పత్రికి రూ.14 లక్షల పరికరాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రికి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చొరవతో రూ.14 లక్షల విలువైన నూతన పరికరాలు మంజూరయ్యాయి. వీటిలో ఐదు ఫీటల్ డాప్లర్ డిజిటల్, రెండు ట్విన్ ప్రొబ్ సీటీజీ మెషిన్లు, రెండు ఏసీలు, రెండు ఫ్రిడ్జ్‌లు, ఒక బయో కెమిస్ట్రీ అనలైజర్, 9 మల్టీ పారా మానిటర్స్ విత్ నియోన్యాటల్ ప్రోబ్స్, 4 మైక్రో ప్రాసెసర్ కంట్రోల్ బేస్డ్ రేడియేంట్ వార్మర్ విత్ స్కిన్ అండ్ ఎయిర్ ప్రోబ్స్ తదితర పరికరాలు ఉన్నాయి. వైద్య పరికరాలు ఇప్పటికే ఆస్పత్రికి చేరుకున్నాయని, త్వరలోనే ఇన్‌స్టాల్ చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

ఏఏఈఓ మునీర్ పాషా మాతృసంస్థకు సరెండర్

భద్రాచలం: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలోని విద్యుత్ శాఖ విభాగంలో పనిచేస్తున్న అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ మునీర్ పాషాను మాతృ సంస్థకు చెందిన ఏస్‌ఈ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, చట్టబద్ధమైన విధి విధానాలు పాటించక పోవడం, బాధ్యత గల పనుల్లో నిర్లక్ష్య వైఖరి కారణంగా ఆయనను సరెండర్ చేసినట్లు పీఓ వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

వేటేయాలంటే.. ఓటుండాలి

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు
- ఏటా కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ చర్యలు

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు (ఫైల్)

చుంచుపల్లి: ఓటే వజ్రాయుధం. దేశ ప్రజాసామ్య సాధానికి ఓటు హక్కే పునాదిగా నిలుస్తోంది. ప్రశ్నించే అధికారం కలిగిన ఓటు హక్కును ప్రతి పౌరుడికీ భారత రాజ్యాంగం ప్రసాదించింది. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో పాలకులను ఓటు ద్వారానే ఎన్నుకుంటాం. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1961 జనవరి 25న అప్పటి ప్రభుత్వం ఓటు హక్కు నమోదును ప్రారంభించింది. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేయించుకునేందుకు ప్రభుత్వం ఏటా స్పెషల్ డ్రైవ్ చేపడుతోంది. ప్రతి వెయ్యి మంది జనాభాలో 698 మంది ఓటర్లు ఉండాలనే లెక్కలతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. యువకులు అధికంగా ఉండే ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ఇతర కళాశాలల యాజమాన్యాలను ఇందులో భాగస్వామ్యం చేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం 2011 నుంచి ప్రతి ఏటా జనవరి 25ను జాతీయ ఓటరు దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా యువ ఓటర్లకు ఓటు హక్కు వినియోగం, విలువలపై ర్యాలీలు, సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తోంది.

ఓటు హక్కు పొందండి ఇలా..

ప్రస్తుతం ఓటు హక్కు పొందడం చాలా సులభంగా మారింది. గ్రామస్థాయిలో పోలింగ్ బూత్ లెవల్ అధికారుల వద్ద దరఖాస్తులు పూర్తి చేసి నమోదు చేసుకోవచ్చు. ఓటరు పేరు, ఇంటి నంబరు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, మొబైల్ నంబరు వివరాలు సేకరించి నమోదు చేస్తారు. ఇందుకు ఫారం ఎఫ్–6,7,8ఏలను వినియోగిస్తారు. దరఖాస్తులు పంచాయతీ, రెవెన్యూ, మీ సేవా కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయి. 1950 జనవరి 25న మొట్టమొదటిసారిగా దేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పౌరుడికి తొలిసారిగా ఓటు హక్కు కల్పించారు. 1952లో మొట్టమొదటిసారి నిర్వహించిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటరు జాబితా ఆధారంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1992 వరకు ఎలక్ట్రో ఫొటో ఐడెంటిటీ కార్డు ఉండేది కాదు. 1993లో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా ఉన్న టీఎన్ శేషన్ ఓటర్ల గుర్తింపు కార్డుల ప్రక్రియను ప్రారంభించారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్ల సంఖ్య	: 9,95,150
పురుషులు	: 4,81,985
మహిళలు	: 5,12,364
సర్వీస్ ఓటర్లు	: 737
ఇతరులు	: 64

సద్వినియోగం చేసుకోవాలి



అందరూ ఓటు విలువ తెలుసుకోవాలి. మన ఓటు ఐదేళ్ల పాటు సుపరిపాలన అందించే వ్యక్తి భవితవ్యాన్ని తేలుస్తుంది. ఎన్నికల సమయంలో ఓటును నోటుకు బలిచేయొద్దు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

–నీరుకొండ హన్మంతరావు, సీనియర్ సిటిజన్, విద్యానగర్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో శుక్రవారం మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

1 నుంచి వాగ్గేయకారోత్సవాలు

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నిర్మాణకర్త, రాముడికి అపర భక్తుడు, భక్త రామదాసుగా పేరొందిన కంచర్ల గోపన్న జయంతి ఉత్సవాలకు వేళయింది. రామదాసు జయంతి సందర్భంగా ప్రతి ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో వాగ్గేయకారోత్సవాలను నిర్వహించటం ఆనవాయితీ. ఈ ఏడాది 392వ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో వేడుకలను జరపనున్నారు. శ్రీ నేండ్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్టు, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు తరలిరానున్నారు. ఫిబ్రవరి 1న ఉదయం 9గంటలకు రామదాసు నవరత్న కీర్తనల గోష్ఠిగానంతో వేడుకలు ప్రారంభంకానున్నాయి. నగర సంకీర్తన, రామదాసు విగ్రహానికి అభిషేకం, ఐదు రోజులపాటు సంగీత కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని ఆలయ ఈఓ రమాదేవి వెల్లడించారు.

8న విరాట్ విష్ణు సహస్ర పారాయణం

20వేల మంది భక్తులతో నిర్వహించేలా ఏర్పాట్లు



కార్యక్రమ ఫ్లెక్సీ, పోస్టర్లతో నిర్వాహకులు

భద్రాచలం: భద్రాచలంలో వచ్చేనెల 8వ తేదీన శ్రీ విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం జీయర్ మఠంలో జరిగిన సమావేశంలో శ్రీ జీయర్ మఠం, వికాస తరంగిణి, భగవద్రామానుజా సేవాసమితి బాధ్యులు వివరాలను వెల్లడించారు. వచ్చేనెల 8న భీష్మ ఏకాదశి సందర్భంగా భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 20వేల మంది భక్తులతో పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలాది మంది ఏకకాలంలో చేసే ఈ పారాయణాన్ని విరాట్ పారాయణంగా పిలుస్తారని, శ్రీరాముడు కొలువైన భద్రాచలంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని చినజీయర్ స్వామి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని వెల్లడించారు. కాగా, 8వ తేదీ మధ్యాహ్నం జీయర్ మఠం నుంచి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో శోభాయాత్ర మొదలై కళాశాల మైదానానికి చేరుకుంటుందని తెలిపారు. సాయంత్రం 4గంటలకు శ్రీరామచంద్రుడి ఆరాధన, మంగళాశాసనంతో పాటు విరాట్ పారాయణం జరుగుతాయని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీయర్ మఠం, వికాస తరంగిణి బాధ్యులు ఎస్‌సీహెచ్.చక్రవర్తులు, గట్టు వెంకటాచార్య, రాము, నాగేశ్వరరావు, కమలా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీని గెలిపించుకోవాలి

ఎమ్మెల్యే పాయం, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం



సారపాకలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం, పొదెం వీరయ్య

బూర్గంపాడు: కార్మిక హక్కుల పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. సారపాకలో ఐఎన్‌టీయూసీ ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే భద్రాచలం పేపర్‌బోర్డుకు బీజం పడిందని గుర్తుచేశారు. పరిశ్రమ అభివృద్ధితో పాటుగా కార్మిక సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ వెన్నుదన్నుగా నిలుస్తున్నందున గెలిపించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, చెన్నం సూర్యప్రసాద్, బట్టా విజయ్‌గాంధీ, పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పాల్వంచరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య సూచించారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుకవారం ఆయన 25 కొబ్బరి మొక్కలను నాటి మాట్లాడారు. నాయకులు నాగా సీతారాములు, ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

కొత్తగూడెంరూరల్: రానున్న రోజుల్లో మతోన్మాద మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేస్తే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. లక్ష్మీదేవిపల్లిలో పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్‌తో పాటు ధర్మారావు, నాగా సీతారాములు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, హనుమంతరావు, చింత్రాల రవికుమార్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

పలువురు మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం 14 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాలకు చెందిన వీరు మావోయిస్టు పార్టీలో వివిధ కేడర్లలో పనిచేస్తుండగా ఇటీవల పార్టీలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యాన లొంగిపోయేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఎస్పీ జితేంద్రకుమార్‌యాదవ్ ఎదుట శుక్రవారం లొంగిపోగా వీరి పేర్లపై ఉన్న రూ.36 లక్షల రివార్డులు అందజేసినట్లు తెలిపారు. అలాగే, నారాయణపూర్ జిల్లాలోనూ 9 మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ ప్రభాత్‌కుమార్ ఎదుట లొంగిపోయారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ, ఎమ్మెల్యే

టేకులపల్లి: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందిపుచ్చుకొని స్వశక్తితో కుటీర పరిశ్రమ నెలకొల్పి పదిమందికి ఉపాధి కల్పించడం అభినందనీయమని, మార్కెటింగ్ వెసులుబాటు కల్పించుకొని ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకాంక్షించారు. శుక్రవారం టేకులపల్లిలో నెలకొల్పిన సఖి నాప్కిన్ యూనిట్, శానిటరీ నాప్కిన్ యూనిట్లను మహిళల సమక్షంలో ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులైన ఐదుగురు గిరిజన యువతులు రూ.9 లక్షల 90 వేల సబ్సిడీతో రూ.16 లక్షల ఖర్చుతో నిర్మించిన నాప్కిన్ యూనిట్‌తో ఆర్థికంగా బలోపేతమవ్వాలని పేర్కొన్నారు. ఇక్కడ తయారు చేస్తున్న నాప్కిన్లపై గ్రామ, మండల సమాఖ్య సమావేశాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తామని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విధంగా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ జేడీఎం హరికృష్ణ, ఐకేపీ ఏపీఎం రవికుమార్, బాణావత్ పుల్లమ్మ, మాలోత్ కరుణ, గౌస్య, చిట్టెమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ల నిర్వహణ అభినందనీయం



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

భద్రాచలంఅర్బన్: ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించడం అభినందనీయమని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ మధుసూదనశాస్త్రి పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో.. యూఎస్‌ఏలోని ఎస్ఆర్ వాసవి అసోసియేషన్ సహకారంతో మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఉచితంగా 700 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో 857 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించడం, కళ్లజోళ్లు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీ, ఎస్.ఎల్.కాంతారావు, భానుప్రసాద్, కామేశ్వరరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు రాజారెడ్డి, సూర్యనారాయణ, చారుగుళ్ల శ్రీనివాస్, ఆఫ్తాల్మిక్ అధికారులు జి.సంజీవరావు, వి.శ్రీనివాసరెడ్డి, తిరుమల్‌రావు, మారుతి కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి తోటలో వ్యక్తి మృతదేహం

- హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి హత్య చేసిన నిందితులు
- మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రమేష్



రమేష్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని లింగారంతండా సమీపాన జాతీయ రహదారి పక్కన ఉన్న మిర్చి తోటలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించగా.. హైదరాబాద్‌కు చెందిన సదరు వ్యక్తిని తీసుకొచ్చి హత్య చేసినట్లు తేలింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.... మిర్చి తోటలో మృతదేహాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై నాగరాజు పరిశీలించారు. మృతుడి రెండు చేతులు ప్లాస్టిక్ తాడుతో కట్టేసి ఉండటం, తలపై గాయాలు కనిపించడమే కాక మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు రాష్ట్రంలోని అన్ని పోలీసుస్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఈనేపథ్యాన మృతుడు హైదరాబాద్‌కు చెందిన బొల్ల రమేష్(52)గా తేలింది. ఆయన రెండు రాష్ట్రాల్లో వ్యాపారులకు పాన్ మసాలా సరఫరా చేస్తుండగా ఈనెల 18న ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడి ఖార్ఖానా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేస్తుండగానే ఓ వ్యక్తి రమేష్‌ను హత్య చేసినట్లు చెబుతూ లొంగిపోయాడు. నలుగురు వ్యక్తులు ఆయనను కారులో ఖమ్మం వైపు 18వ తేదీ రాత్రి తీసుకొచ్చి హత్య చేశాక ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి పక్కన మిరపతోటలో మృతదేహాన్ని పడవేసినట్లు చెప్పాడు. దీంతో అక్కడి పోలీసులు వచ్చి గాలించినా సరైన ప్రాంతం తెలియక వెనుతిరిగారు. ఇంతలోనే కూసుమంచి పోలీసులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రమేష్ కుటుంబీకులతో శుక్రవారం రాత్రి వచ్చి మృతదేహం ఆయనదేనని నిర్ధారించుకున్నారు. డబ్బు కోసమే రమేష్‌ను హత్య చేసినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోవడంతో ఘటనాస్థలంలోనే పంచనామా నిర్వహించి అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతోనే అంత్యక్రియలు నిర్వహించారు.

82 కిలోల గంజాయి పట్టివేత



కారు, గంజాయి, నిందితులను చూపుతున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 82 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.రమేశ్ కథనం ప్రకారం.. ఒడిశాలోని మల్కన్‌గిరిలో కొనుగోలు చేసిన 82 కేజీల గంజాయిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వ్యక్తులు.. కారులోని వెనుకసీట్ కింద ప్రత్యేక అర తయారు చేయించి భద్రపరిచారు. ఈ కారును ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆపి తనిఖీ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు మరికొన్ని వస్తువులు, కారును సీజ్ చేశారు. కాగా, గంజాయి విలువ రూ.41 లక్షలు ఉటుందని, మిగిలిన వస్తువుల విలువ రూ.9 లక్షలు ఉంటుందని, నిందితులు కొట్టపంజు బకోద్రి, అబ్దుల్ నిజాద్ గంజాయిని కేరళ తరలిస్తూ పట్టుబడ్డారని, వారిపై భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెల్లడించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, హరీశ్, విజయ్ ఉన్నారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేశ్ అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కె.రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని చాపరాలపల్లి అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6 వేల నగదు, 5 మోటార్ సైకిళ్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలి నుంచి పరారైన మరో నలుగురి గురించి విచారణ చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. క్యాక్రమంలో కానిస్టేబుళ్లు తిరుపతిరావు, రవికుమార్, రమణ, చిచ్చి, భాస్కర్, తేజ పాల్గొన్నారు.


అంగన్‌వాడీ టీచర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

కారేపల్లి: విధుల్లో ఉన్న అంగన్‌వాడీ టీచర్‌ను అకారణంగా కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కారేపల్లి క్రాస్ రోడ్డు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భూక్యా పుష్పలత ఈనెల 23న కేంద్రంలో విధులు నిర్వర్తిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆవుల వెంకట్రావ్ వచ్చి కులం పేరుతో దూషించి దాడి చేశాడు. ఘటనపై బాధిదురాలి ఫిర్యాదుతో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.రాజారాం తెలిపారు.

దుప్పిని చంపిన కేసులో ఒకరు రిమాండ్

పాల్వంచరూరల్: నాలుగేళ్ల కిందట దుప్పిని వేటాడి చంపిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధించారు. వైల్డ్‌లైఫ్ రేంజర్ కవితమాధురి కథనం మేరకు.. మండలంలోని యానంబైల్ రేంజ్ పరిధిలోని మొండికట్ట బీట్‌లో 2021 డిసెంబర్ 9న కిన్నెరసాని జలాశయం బ్యాక్ వాటర్ ప్రాంతంలో చేపలవేటకు వెళ్లిన మొండికట్టవాసులు దేశెట్టి నాగేశ్వరరావు, దాసరి సత్యనారాయణ, దేశెట్టి కృష్ణయ్య దుప్పిని వేటాడి చంపారు. దాని మాంసాన్ని పోగులు వేసుకున్న ఘటనలో ముగ్గురిపై వైల్డ్‌లైఫ్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో దేశెట్టి నాగేశ్వరరావును పట్టుకుని కోర్టులో హాజరు పరచగా ఆయిన కోర్టుకు గైర్హాజరవుతుండటంతో కొత్తగూడెం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వారెంట్ జారీ చేశారు. దీంతో నాగేశ్వరరావును పట్టుకుని గురువారం కోర్టులో హాజరు పరుచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు రేంజర్ తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఆయన చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య..



ఇడమయ్య మృతదేహం

కరకగూడెం: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేందర్ కథనం మేరకు.. మండలంలోని నీలాద్రి పేటగండి గొత్తికోయ గ్రామానికి చెందిన కుంజా ఇడమయ్య (48) రెండేళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. గతంలో రెండుసార్లు ఇంటి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వెతికి పట్టుకున్నారు. శుక్రవారం భర్గగూడెం గ్రామ శివారులోని చెరువు గట్టుపై ఉన్న చెట్టుకి ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి భార్య కుంజా పొజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. కాగా మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో..

పాల్వంచ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని తెలంగాణ నగర్‌కు చెందిన ఎస్‌కే చాంద్‌పాషా(42)కు, భార్య షమీరకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఓ ఫంక్షన్‌కు భార్య రానని చెప్పడంతో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన చాంద్‌పాషా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య షమీర ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.